www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 మే 2023
5
అన్నమయ్య

పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

విశాఖ 'ఉక్కు'ను కాపాడుకుందాం

రాయచోటిలో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష, కార్మిక సంఘాల నాయకులు

- రాస్తారోకోలో అఖిలపక్ష నాయకుల పిలుపు
- అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులు
- నాయకులు, పోలీసులకు వాగ్వివాదం
- నాయకుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో బంగ్లా సెంటర్‌లో జాతీయ రహదారిపై విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, కాంగ్రెస్ పార్టీలతో పాటు సిఐటియు, ఎఐటియుసి, ఎంఆర్‌పిఎస్, మైనార్టీ హక్కుల పరిరక్షణ వేదిక తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు బంగ్లా సెంటర్‌కు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కును కాపాడుకుందాం, బిజెపి డౌన్ డౌన్, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం, అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న రాయచోటి పట్టణ సిఐ సుధాకర్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమించాలని ఆందోళనకారులకు విజ్ఞప్తి చేశారు. ఆందోళనకారులు రాస్తారోకో కొనసాగిస్తూ రోడ్డుపై బైఠాయించారు. రాస్తారోకోను అడ్డుకునే ప్రయత్నం పోలీసులు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆందోళనకారులను సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, పి.ఎల్.నరసింహులు, మైనార్టీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు సగీర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాల శ్రీనివాసులు, బిఎస్‌పి నాయకులు యుగంధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామ చంద్ర, రంగారెడ్డి గిరిజన సంఘం నాయకులు విశ్వనాథ నాయక్, సిఐ టియు జిల్లా కమిటీ సభ్యులు ఫయాజ్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నాగబసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నికృష్ణ, ఎంఆం పిఎస్ నాయకులు రామానుజులు, తదితరులు ఉన్నారు. అరెస్టు చేసిన వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రయివేటు పరం కాకుండా అడ్డుకోవడం కోసం ప్రజలందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. 800 రోజులకు పైగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలు చేస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఏమి ఎరగనట్లు ఉండటం దుర్మార్గమన్నారు. ప్రయివేటీకరణ ఆపేదే లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమాలకు జగన్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడమే కాకుండా ఆందోళనలో పాల్గొనాలని వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకవైపు మద్దతిస్తూ రెండోవైపు ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి పట్ల మెతక వైఖరితో వ్యవహరిస్తున్న జగన్ బిజెపిపై పోరాడినా సహించలేక పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం కూడా విశాఖ ఉక్కు రక్షణకు కట్టుబడి ఉన్నామని చెబుతూనే ఆందోళనలో పాల్గొనకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజలందరూ ఐక్యంగా పోరాడినప్పుడే విశాఖ ఉక్కును కాపాడుకోగలమని వివరించారు. 812 రోజులుగా జరుగుతున్న విశాఖ ఉక్కు రక్షణ పోరాటాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని హెచ్చరించారు. నిర్బంధం పెరిగేకొద్ది ఉద్యమాలు పెరుగుతాయనే కనీస ఇంగిత జ్ఞానం పాలకులు లేకపోవడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని, విశాఖ ఉక్కు మాదే.. దానిపై హక్కు మాదేనని సిపిఐ సహాయ కార్యదర్శి మహేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ పోరాట కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం ఎదుట ఎఐటియుసి, సిపిఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.ాార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్, జిల్లా భవన నిర్మాణ కార్మికసంఘం నాయకుడు గాలిచంద్ర, కే.వెంకటయ్య, నాయకులు నాగేశ్వరావు, ఉప్పు చంద్ర, చోటు, మహమ్మద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సిపిఐ, టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక జ్యోతిచౌక్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రయివేటీకరణపై జగన్ సర్కార్ మౌనం వీడాలని, విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ ప్లే కార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, టిడిపి నాయకులు చావిడి కిట్టన్న, నాయకులు ప్రభాకర్, బాలాజీ, నాగరాజులు, ఎం.అష్రఫ్అలీ, హెచ్.షమీవుల్లా, యస్.తంబయ్యశెట్టి, జవహర్‌బాబు, బాలకృష్ణ, గంగులప్ప, మోదీన్ సాహెబ్, రియాజ్, హబీబ్, ఖాసీం, ఎస్.గఫూర్ పాల్గొన్నారు. **ములకలచెరువు :** విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ పట్టణంలోని జాతీయ రహదారిపై సిపిఐ మండల కార్యదర్శి అంజనప్ప, టౌన్ కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేస్తే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. **మదనపల్లె అర్బన్:** విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకై కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీసు ఎదురుగా రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి నాయకులు టి.హరేంద్రనాథ్ శర్మ, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణప్ప, మురళి, తిరుమల దేవా, రెడ్డప్ప, మస్తాన్, శోభ, అనసూయ, రమణ, నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులును అరెస్టు చేస్తున్న పోలీసులు

మదనపల్లెలో నిరసన తెలుపుతున్న కార్మిక, అఖిలపక్ష నాయకులు

మాట్లాడుతున్న పీలేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు కోర్టు ఆవరణంలో ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ పదాలత్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పీలేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక కోర్టులో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో జరిగిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కక్షి దారులు, బ్యాంకర్లు, న్యాయవాదులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీకి సాధ్యమైన క్రిమినల్, కాంపౌండ్ కేసులు, సివిల్, మోటార్ వాహన కేసులు, కుటుంబ తగాదాల కేసులు, మొదలైనవి ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు తమ తమ స్టేషన్ పరిధిలో పెండింగ్ లో ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపిపి శారద, పీలేరు సిఐ మోహన్ రెడ్డి, ఎక్సైజ్ సిఐ గురు ప్రసాద్, ఇతర స్టేషన్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

5 నుంచి బాస్కెట్‌బాల్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈ నెల 5వ తేదీ నుంచి స్థానిక పివిసి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాస్కెట్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, క్రీడలపై ఆశక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శ్రీ షిరిడిసాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 105 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు శ్రీధన్య, చాందిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రహదారి పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారి పనులను మండలంలోని టేకలకోన గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం గ్రామం వద్ద రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా వెళ్లి నిరసనలు తెలిపారు. రెండు, మూడు సర్వేల ప్రకారం తమకు చాలా నష్టం కలుగుతుందని, మొదటి సర్వే ప్రకారం రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల కల్టెర్ గిరీష టేకలకోనలో పర్యటించి, మొదటి సర్వే ప్రకారమే విస్తరణ పనులను చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. అయితే ఎన్‌హెచ్ అధికారులు మాత్రం రెండు, మూడు సర్వేల ప్రకారం విస్తరణ పనులు చేపట్టు తుండడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. మూకుమ్మడిగా రోడ్డు పనులను అడ్డుకుని, విషయాన్ని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తక్షణమే రోడ్డు విస్తరణ పనులను ఆపాలని రైతు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టేకలకోన గ్రామస్తులు పాల్గొన్నారు.

టేకలకోన వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

హద్దురాళ్ల ప్రక్రియ వేగవంతం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల ఏడులోగా హద్దురాళ్ళు నాటే ప్రక్రియ వంద శాతం పూర్తి కావాలని సర్వేయర్లను కలెక్టర్ గిరీష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్న భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా హద్దురాళ్ళు పాతే అంశంపై సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తి అయిన గ్రామాలలో హద్దురాళ్లను తప్పనిసరిగా పాతించాలని సర్వేయర్లతో సూచించారు. ఎన్ని రాళ్లు వచ్చాయి, ఎన్ని పాతారు, ఇంకా ఎంత పాతాలి, ఇంకా ఎన్ని అవసరము వివరాలన్నీ ఎప్పటికప్పుడు తెలియ జేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా సరైన కార్యాచరణ రూపొందించుకొని హద్దురాలు నాటే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆ గ్రామానికి ఎన్ని రాళ్లు వచ్చాయో వచ్చిన వాటిని సాధ్యమైనంతవరకు విలేజ్ అంతా కవర్ చేయా లన్నారు. వంద మీటర్లకు హద్దురాయి నాటాలన్నారు. ఇంకా ఎక్కడ అవసరం ఉందో ఆ వివరాలు పంపాలన్నారు. రీ సర్వేలో బై జంక్షన్, ట్రై జంక్షన్‌లకు హద్దురాళ్ళు పాతాల్సి వస్తుందని, అలాంటివి ఎన్ని ఉన్నాయన్న వాటిలో పక్కా వివరాలను సమర్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే శాఖ ఎడి జయరాజ్, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి రాయచోటి

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం ఖాయమని నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎస్.అల్లా బకాష్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా టుడే- సిఓటర్ తాజా సర్వే ప్రకారం కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 107-119 మధ్య, బిజెపికి 74-86 మధ్య, జెడిఎస్‌కు 23-35 మధ్య, ఇతరులకు 0-5 మధ్య సీట్లు వస్తాయని తేలిందన్నారు. ఈ సర్వే ప్రకారం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన జోష్యం చెప్పారు. ఈ సంవత్సరంలో జరగబోవు రాజస్థాన్, ఛత్తీగఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. 2024లో జరగబోవు లోక్‌సభ ఎన్నికలు కూడా మిత్ర పక్షాలతో కలసి కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. వీటన్నిటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం వస్తుందని ప్రజలనుకుంటే కాంగ్రెస్ పార్టీకి 1978లో వచ్చిన అధికారం తిరిగి సంపాదిస్తుందని పేర్కొన్నారు.

సిఎం జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవ వనరులు అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కరోనా కష్టకాలంలో రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథకంలో నడిపిన ప్రభుత్వం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. మానవ వనరుల అభివృద్ధి, తాగునీరు, సాగునీటి అభివృద్ధిలో భాగంగా గండికోట రిజర్వాయర్, హంద్రీ-నీవా సుజల స్రవంతి సాగునీటి కోసం కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, బిటి కళాశాలను విశ్వవిద్యాలయం, అత్యంత విశిష్టమైన మెడికల్ కాలేజ్ పనులు వేగవంతంగా జరుతున్న పరిస్థితి నేడు ఉందన్నారు. త్వరలోనే కేంద్రీయ విద్యాలయం పేద విద్యార్థుల కోసం శ్రీకారం చుట్టనున్నట్లు స్పష్టం చేశారు. నేషనల్ హైవేలకు సంబంధించి నాలుగు వరుసల రహదారి, నీటిపారుదలకు 11 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకమైన శ్రద్ధను పెట్టారన్నారు. ఇది కేవలం రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మదనపల్లిపై ప్రత్యేక శ్రద్ధ వహించిన రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతోనే అభివృద్ధి జరిగిందన్నారు.

రక్తహీతన రహిత జిల్లాగా మారుద్దాం

సమీక్ష సమావేశంలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

రక్తహీనత రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌సిడి-సిడి సర్వే, ఎఎన్ఎం ఫీడ్ బ్యాక్, గ్రీవెన్స్, అనీమియా తదితర అంశాలపై వైద్య అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న ఆహార అలవాట్లతో వయస్సు నిండకుండానే జీవనశైలి జబ్బులు చుట్టుముడుతున్నాయని పేర్కొన్నారు. వ్యాధి ముదిరిపోయే వరకు గుర్తించకపోవడంతో ప్రాణాంతకంగా మారుతున్నాయని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) సహా పలు రకాల స్క్రీనింగ్ పరీక్షలను ఎఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎన్‌సిడి సర్వేలో గుర్తించిన అసాంక్రమిక వ్యాధుల బాధితులకు ప్రభుత్వమే ఉచితంగా వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఎన్‌సిడి స్క్రీనింగ్‌తో పాటు ప్రజలకు డిజిటల్ ఆరోగ్య ఐడీని ఆరోగ్య కార్యకర్తలు త్వరగా పూర్తి చేయాలన్నారు. స్క్రీనింగ్‌లో వెల్లడైన ఆరోగ్య వివరాలను ఐడీ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. హెల్త్ ఐడి జనరేట్ వారం వారం ప్రోగ్రెస్ కనపడేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్‌సిడి-సిడి సర్వేలో భాగంగా జీరో నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వివరాలను నమోదు చేయాలన్నారు. అందరూ కూడా తమ పరిధిలో ఉన్నటువంటి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తప్పకుండా నమోదు చేయించాలన్నారు. జిల్లాను రక్తహీనత లేని జిల్లాగా మార్చేందుకు వైద్య అధికారులు కృషి చేయాలని సూచించారు. గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పులు లేకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. హెచ్‌బి శాతం మైల్డ్‌గా ఉన్న నెంబర్‌ను నార్మల్‌కు తీసుకురావాలన్నారు. సివియర్‌గా ఉన్న వారి పట్ల ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. కోవిడ్ పరీక్షలు ఆర్ టిపిసియర్ లో మాత్రమే చేయాలన్నారు. ఎఎన్ఎం ఫీడ్బ్యాక్ గడువులోగా పరిష్క రించాలన్నారు. సమీక్షలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు. **పట్టణ పిహెచ్‌సిలో కలెక్టర్ తనిఖీ :** స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గిరీష సందర్శించి ఒపి, మందుల నిల్వ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం పైన అవగాహన కల్పించాలన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్ని వర్గాల ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు నూతనంగా నిర్మించిన మండల పరిషత్ భవన సముదాయం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం నూతన భవనాన్ని ఎంపిపి రాజమ్మ, రాష్ట్ర ఫౌరసరఫరాల డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, బిసి నాయకుడు పల్లపు రమేష్‌లతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే క్రమంలో సచివాలయ వ్యవస్థను పల్లె ప్రజల ముంగిటకు తీసుకువచ్చిందన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రతి పంచాయతీలో ఇంద్ర భవనాల్ల కనిపించే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజి క్లినిక్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఈ క్రమంలోనే అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటిలో కోట్ల రూపాయలతో మండల పరిషత్ భవనాన్ని నిర్మించి అందు బాటులోకి రావడం శుభ పరిణామన్నారు. అభివృద్ధి లేదని విమర్శలు చేసే వారికి పంచాయతీలలో కనిపించే సచివాలయ భవనాలు, గ్రామీణ ప్రాంతాలకు ఏర్పాటుచేసిన తారు రోడ్లు, రాయచోటిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సమాధానం చెబుతున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ఎపిఐఐసి స్టేట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపిపి జయపాల్‌రెడ్డి, విఆర్.రెడ్డి, ఎంపిడిఒ మల్‌రెడ్డి, తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, ఎంపిటిసిలు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగసుబ్బమ్మ, చిట్టెమ్మ, నాగవేణి, సహదేవమ్మ, సర్పంచులు పోలు సావితమ్మ, రాయవరం మమత, కసిరెడ్డి సుబ్బలక్ష్మి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, ప్రభావతమ్మ, తిరుపాల్ నాయుడు, ఫాహిదా, నాగవేణి, రెడ్డెమ్మ, వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాష, దివాన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యాలయ సముదాయాన్ని ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

లయన్స్‌క్లబ్ సేవలు ఎనలేనివి : సిఐ

ప్రజాశక్తి-సంబేపల్లి

లయన్స్ క్లబ్ ఆఫ్ సేవలు ఎనలేవని, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలిని సిఐ లింగప్ప పేర్కొన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలో ఉండే బిఎంఆర్ రెస్టారెంట్ అధినేత లయన్ బి.నాగిరెడ్డి ఆర్థిక సౌజన్యంతో సంబేపల్లి పోలీస్ స్టేషన్‌కు ట్రాఫిక్ నియమ నిబంధనల 25 సూచిక ఫ్లెక్సీలను సిఐ లింగప్ప, ఎస్ఐ ఎస్.ఎం.డి.షరీఫ్‌కు అందజేశామని క్లబ్ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. తమకోసం మీ ఇంటి దగ్గర తమ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తూ ఉంటారని దృష్టిలో పెట్టుకొని అందరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. సిఐ లింగప్ప, ఎస్ఐ ఎస్.ఎం.డి.షరీఫ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రజలకు ఎక్కడ ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ముందుకు వచ్చి సహాయం చేస్తున్నారని పేర్కొన్నారు. దాత లయన్ బి.నాగిరెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ర, నందిని, వినోద్ కుమార్ నాయక్, గంగిరెడ్డి పోలీస్ సిబ్బంది సుబ్బయ్య, వేణుగోపాల్ నాయక్, రెడ్డయ్య పాల్గొన్నారు.

పోలీసులకు సూచిక బోర్డులు అందజేసిన దాతలు

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-రాయచోటి

వైసిపి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలో 22వ వార్డులో ఇదేమికర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలు గురించి ఆయన ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రాబోవు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలని తానను రాయచోటి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపించాలనీ ప్రజలను కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరగలేదని సంక్షేమ పథకాల పేర్లతో వైసీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టి కోట్లు కోట్లు దోసుకుంటున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతానే యువతకు నిరుద్యోగ ఉపాధి వ్యవసాయ డ్వాక్రా తదితర సంక్షేమ పథకాలు అన్ని కల్పిస్తానన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు. విద్యుత్ దీపాలు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పించామని తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర వనరులు ఇసుక మాఫియా, భూకబ్జాలు, గంజాయి వ్యాపారాలు, వైసిపి నాయకులు చేస్తున్నారన్నారు. చుక్కల భూములు. బీడీగా ఉన్న భూములను ఇవన్నీ వైసిపి నాయకులు దోసుకుంటున్నారని ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుంటే ప్రజలు ఊహించలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే నాలుగు మెతుకులకు 36 మెతుకులు పైన ట్యాక్సు ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చింది ఏమీ లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ భాష, పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, క్లసర్ ఇన్‌ఛార్జి సాయి ప్రతాప్, వీరభద్ర స్వామి గుడి మాజీ చైర్మన్ శివప్రసాద్, ముబారక్, రెడ్డెయ్య, ఇలియాజ్, యూనిట్ ఇంచార్జ్అమీర్ జాన్, జావిద్, మాజీ కౌన్సిలర్ మహబూబ్ భాష, హుసేన్, సర్దార్, సత్యరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, షబ్బీర్, జిలాన్ భాష, సాయి, శివారెడ్డి, రెడ్డిబాషా, ఇర్ఫాన్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శేఖర్ నాయక్

విద్యుత్ బిల్లులపై సర్వే చేయాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని గ్రామాలలో ప్రతి వీధిలో ఉన్న ఎల్ఇడి బల్బులకు విద్యుత్ ఎంత ఖర్చవుతుంది, స్కీం మోటర్ లకు వచ్చే విద్యుత్తు బిల్లులపై సర్వే చేయాలని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రెటరీతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాలు వయస్సున్న పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి పోస్టాఫీస్, గాలివీడు-1, నూలివీడు, గోరాన్‌చెర్వు గ్రామాలలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. వైఎస్ఆర్ పెళ్లికానుక కోసం వెల్ఫేర్ అసిసెంట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సొంత స్థలం ఉండి ఇంటి పట్టా పొందిన వారు గృహాలు నిర్మిస్తున్నారా లేదా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో ఉన్న సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు బయోమెట్రిక్ హాజరు తప్పక నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేష్‌కుమార్, ఆంజనేయులు నాయక్, సరోజమ్మ, సచివాలయ సెక్రటరీ రాధికా రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వడుగులు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని స్థానిక పెద్దూర్ కస్పా లోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వడుగుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు బికె.మహమ్మద్ రియాజ్ పేర్కొన్నారు. అనుభవం కలిగిన వైద్యులచే పరీక్షలు నిర్వహించి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లల తల్లిదండ్రులకు భోజన వసతితో పాటు మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా వాణి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నియామక పత్రాన్ని అందుకుంటున్న వాణి

సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా డి.వాణిని అధికారికంగా నియమించారని నేషనల్ బోర్డు కమిటీ డైరెక్టర్ కె.రవిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ చైర్మన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని మహిళా హక్కుల సమస్యలు, వాటి పరిస్కారం కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ కోసం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం, రాజ్యాంగ ఫలాలు, హక్కులు అందరికీ దక్కేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం అందరూ సమానులేనని ఎటువంటి కుల, మత, లింగ, రాజకీయ వివక్ష లేకుండా అందరికీ సమన్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. సౌత్ ఇండియా చైర్మన్ ఎండి నజీముద్దీన్, సౌత్ ఇండియా వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ హనుమగౌడ్, స్టేట్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తగవు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి కాటాలో దొంగతనం జరుగుతుందని యాజమాన్యానికి చెప్పినందుకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం తగదని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. లక్షలాది రూపాయలు జీతం తీసుకుంటూ నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న ఐటి మేనేజర్‌గా హేమంత్ కుమార్ అనే కాంట్రాక్ట్ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్పోరేట్ జీతం తీసుకుంటూ సిసి కెమెరాలు, భూమ్ బారియర్‌లు పనిచేయకున్నా పట్టించుకోని ఐటి ఉద్యోగిపై చర్యలు తీసుకోకుండా అమాయక అమాయక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం దారుణమని అన్నారు. దొంగతనానికి పాల్పడు తున్న వారిపై ఫిర్యాదు చేయడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. దొంగతనాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విధుల నుంచి తొలగించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వేంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాని డిమాండ్ చేశారు. లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఐటి మేనేజర్ పై చర్యలు తీసుకోవాలన్నారు.

మదరసాలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

నూరానిఖాయిద, నాజిర, ఖురాన్ హిఫ్జ్, ఫారసీ, దర్సె నిజామి మౌల్వి కోర్స్ తరగతులలో చేరే విద్యార్థులకు ఈనెల 6 నుంచి అడ్మిషన్లు ప్రారంభ మవుతాయని దారుల్ ఉలూమ్ ఇందాదియా మదరసా ప్రిన్సిపల్ ముఫ్తీ సయ్యద్ మాసూమ్ సాఖిబ్ సాహెబ్ తెలిపారు. బుధవారం తమ మదరసా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దారుల్ ఉలూమ్ ఇందాదియా మదరసాలో చేరిన విద్యార్థు లందరికీ ఉచిత భోజన వసతి, వైద్య సదుపాయంతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ ప్రకారం పదవ తరగతి వరకు ఉచిత విద్యా బోధన అందించి ఓపెన్ స్కూల్ ద్వారా హైస్కూల్ పరీక్షలు రాయిస్తామని చెప్పారు. జిల్లా లోని నిరుపేదలైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు నిమ్మనపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ లీలా మాధవి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నవాజ్ బాషా హాజరవుతున్నట్లు తెలిపారు. మండల సమావేశం మండల పరిషత్ సమావేశ భవనంలో మధ్యాహ్నం గం.2.30 గంటలకు నిర్వహించబడునని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి నివేదికలను సమావేశానికి తీసుక రావాలని సూచించారు. సర్పంచులు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకు రావాలని సూచించారు.

రాజశ్రీ ఎల్ ఆర్ పల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.NO : 28/2022

పాటుకూరి వెంకటేశ్వర్లు S/o సుబ్బారాయుడు D/NO: 43/3 బోస్ నగర్ రాయచోటి టౌన్ అన్నమయ్య, జిల్లా.
...వాది

V/s

దొడ్డ రామచంద్ర S/o గంగయ్య, D/NO: 10/31 R/O రామాపురం, దప్పిపల్లె(పోస్ట్) లక్కిరెడ్డిపల్లి మండలం, అన్నమయ్య (జిల్లా).
...ప్రతివాది

ప్రకటన

పై నెంబరు దావాలోని వాది ప్రతి వాది అయిన నీ పైన బాండు బాపతు విషయముగా దావా దాఖలు చేసియున్నాడు నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 11-5-2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు సదరు కోర్టులో హాజరై నీ యొక్క ఆక్షేపణ తెలుపు కొనవలెను లేనంతట నీ పరోక్షమును తీర్మానించబడును అని ఇందు మూలమున ఖండితముగా తెలియచేయడమైనది.

ఉదయగిరి రామాంజనేయులు
G.C.S.రాయుడు,
వాది తరుపున వకీలు
రాయచోటి.

పాస్‌పోర్టు పోయినది

అన్నమయ్య జిల్లా, పుల్లంపేట మండలం, పుల్లంపేట గ్రామానికి చెందిన బుదారపు బాలాజి, S/o కీ॥శే॥ బుదారపు రామమూర్తి కి చెందిన పాస్‌పోర్టు పోయింది. దొరికినచో క్రింది అడ్రస్సుకు తెలుపగలరు.

అడ్రస్సు : మెయిన్‌రోడ్డు, పుల్లంపేట
(Vi)(Po) (Mandal)-516107.

సాంకేతిక విద్యతోనే ఉపాధి : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థినికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సాంకేతిక విద్యను అభ్యసించినప్పుడే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షిక, ఉద్యోగ విజయోత్సవం ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ సాంకేతిక విద్యపై నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ప్రాంగణ ఎంపికల్లో చివరి సంవత్సరానికి చెందిన విద్యార్థులు వివిధ ప్రయివేట్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు. అనంతరం ప్రిన్సిపల్ విద్యార్థులు చిన్న వయసులోనే ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. కార్యాక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, ఎంపిడిఒ గంగయ్య, జడ్‌పిటిసి పద్మజ, లోకవర్ధన్, ఎంపిపి నూర్జహాన్, డా.ఎం.శివరామక్రిష్ణ, ఇసిఇ శాఖాధిపతి, బి.సాంబశివారెడ్డి, ఇఇఇ శాఖాధిపతి కళాశాల సిబ్బంధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

మురుగు నీటితో నరకయాతన

చెరువును తలపిస్తున్న మురుగు నీటి గుంతలు

ప్రజాశక్తి-కురబలకోట

ముంబయి-చెన్నై జాతీయ రహదారిపై మురుగు నీటి గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. నీటి గుంతల వల్ల నరకయాతన అనుభవిస్తున్నారని వాహన దారులు వాపోతున్నారు. అంగల్లు గ్రామ పంచాయతీలో నూతన మురుగు నీటి కాలువను మంజూరు చేసి నిర్మాణం చేపడుతున్నారు. అయితే రోడ్డు కు ఇరువైపులా ఉన్న హాస్టళ్లలో నుంచి మురుగు నీరు రోడ్డుకు మళ్లించడం వలన మురుగు నీరు రోడ్డులో ప్రవహిస్తోంది. ఈ రోడ్డు మార్గంలో ప్రయివేట్ ఇంజి నీరింగ్ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహన దారులు నరకయాతన అనుభ విస్తున్నారు. రోడ్డు పై మురుగునీరు చేరి గుంతలు పడి చెరువులా తయార య్యాయి. పంచాయితీ అధికారులు గుంతలకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేనా..?

- వాహనదారుల ఇబ్బందులు తీరేనా

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రోడ్డుపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా జ్యోతి చౌక్ నందు ద్విచక్ర వాహనాలు అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతోందని ప్రజలు, వాహన దారులు పేర్కొంటున్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తున్నప్పటికీ, పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉండడంతో సమస్యను పూర్తిగా నిర్మూలించలేక పోతున్నారు. ఈ విషయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దుకాణ యజమానులకి ఇబ్బంది కలిగించేలా షాపులు దుకాణాల ముందు అడ్డంగా, ద్విచక్ర వాహనాలు నిలపడం, దుకాణ దారులు ఇక్కడ పార్కింగ్ చేయ కూడదంటే తమపై దుర్భాషలాడుతున్నారని దుకాణదారులు వాపో తున్నారు. పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించి, మదనపల్లి పట్టణం తరహాలో రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి జరిమానా విధించాలని దుకాణ యజమానులు, ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ విషయంలో పూర్తిగా పోలీసులు విఫలం కాకుండా యంత్రాల ద్వారా ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : 'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో మ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని జాగువారిపల్లి సచివాలయ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను, సమస్యలను పరిష్కార దిశగా చర్చిస్తూ, ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ప్రభుత్వ విప్ పరిశీలించడం జరిగింది. గ్రామ సమస్యలు, నీటి సమస్య, జగనన్న లేఅవుట్లు ఎటువంటి సమస్య అయినా తమ దృష్టికి తీసుకుని వస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహా కుమార్, ఎంపిడిఒ ప్రకాశం, ఎస్ఐ సుబ్బారెడ్డి, నాయకులు కొల్లం గంగిరెడ్డి, కన్వీనర్ నాగిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, నరసింహారెడ్డి భరత్ కుమార్‌రెడ్డి పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దమండ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండలంలోని వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాలంటీర్ తమ పరిధిలో గల అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మీదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసిపి అధికారం వచ్చే విధంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్ పేర్కొన్నారు. సమావేశంలో ఎంపిడిఒ శ్రీధర్‌రావు, జడ్‌పిటిసి పీరమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిని, సచివాలయం మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, కో-ఆప్షన్ ఖాదరవల్లి, సర్పంచ్‌లు బాషా, బయ్యారెడ్డి, విశ్వనాథ్, విజయకుమారి, విశ్వనాథ్‌రెడ్డి, పద్మావతి, తిరుపాల్, సరస్వతి, పిరాంబి, జయమ్మ, ఎంపిటిసి జయరామ్, రవితేజ, చాను, ఎపిఒ మురళి, ఎపిఎం మధు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నర్సరీ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటియం మండలంలోని నిర్వాహకులందరూ తప్పనిసరిగా ఉద్యానవన శాఖ అనుమతులు పొందాలని ఉద్యాన వనశాఖాధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం నర్సరీ యజమానులు ఆర్‌బికె అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ప్రతిఒక్కరు అనుమతులు పొందాలని, రైతులకు నాణ్యమైన నారు ను అందించాలన్నారు. మొక్కల అమ్మకానికి సంబంధించిన వివరాలు రైతులకు బిల్లులు ఇవ్వాలని చెప్పారు. రైతులకు మొక్క నాణ్యత గురించి వివరిం చాల న్నారు. ప్రతిరోజు వ్యవసాయాధికారుల పర్యవేక్షణ ఉంటుందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎఒ ప్రేమలత, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నర్సరీ యజమానులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఎస్ఐగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -రామసముద్రం

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సి.చంద్రశేఖర్

మండలం నూతన ఎస్ఐగా సి.చంద్రశేఖర్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మదనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసి బదిలీపై రామ సముద్రం మండలానికి వచ్చినట్లు తెలిపారు. మండలంలో శాంతి భద్రతలకు కల్పనకు కృషి చేస్తానని, క్రైమ్ రేట్ తగ్గించడానికి ప్రయత్నం చేస్తానని ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు.

వైసిపికి ఎంపిటిసి రాజీనామా

ఎంపిటిసి క్రిష్ణకుమారి

ప్రజాశక్తి-కలకడ

వైసిపికి ఎంపిటిసి రాజీనామా చేసిన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని గుడిబండ పంచాయతీ గుడిబండ ఎంపిటిసి జె.కృష్ణకుమారి తన ఎంపిటిసి పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సొంత కారణాలతో తన సొంత నిర్ణయంతో తన రాజీనామాను జిల్లా సిఇఒకు పంపడం జరిగిందని ఆమె తెలిపారు. తన రాజీనామాను సిఇఒ ఆమోదించవలెనని ఆమె తెలిపారు. అంతేకాకుండా ఈమె ప్రస్తుతం మండల వైస్ ఎంపిపిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె భర్త జల్లా రాజగోపాల్ రెడ్డి కోన సర్పంచిగా ప్రస్తుతం పదవులు ఉన్నారు. ఎంపిటిసి కృష్ణ కుమారి రాజీనామా పై పలువురు వైసిపి నాయకులు సందిగ్ధంలో పడ్డారు.

హస్తకళల రాష్ట్ర డైరెక్టర్‌గా నిర్మలాదేవి

ప్రజాశక్తి-కలకడ

జానపద నాట్యకళ, హస్తకళల రాష్ట్ర డైరెక్టర్‌గా నిర్మలాదేవి ఎంపికయ్యారు. బుధవారం విజయవాడలో శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆంధ్రప్రదేశ్ జానపదాలు, నాట్యకళలు, హస్తకళలు డైరెక్టర్‌గా రాయచోటికి చెందిన జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు చిదంబరరెడ్డి సతీమణి నిర్మలాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా కుటుంబానికి గౌరమిచ్చి నాకు ఈ పదవి లభించినందుకు సహకరించిన ఎంపీ మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రోజా, ఆవుల విష్ణువర్ధనరెడ్డికి అభినందనలు తెలిపారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న నిర్మలాదేవి

కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

తెల్ల దోమలను నివారిద్దాం

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని వంకగడ్డపలిలో టి .రాచయ్య కొబ్బరి తోటను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వై .పీరు సాహెబ్, ఎడిఎ ఎంవి.శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారున మాట్లాడుతూ జిల్లాలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలైన కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, మామిడి తోటలో ఈ మధ్యకాలంలో సర్పిలాకార అనే తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. ఆశించిన మొక్కల భాగాలైన ఆకుల నుంచి రసం పీల్చడం వలన ఆకుల పసుపు రంగు మారడం, ఉధృతి ఎక్కువైనప్పుడు మసి తెగులు ఆశించి ఆకులన్నీ ఎండిపోవడం జరుగుతుందని తెలిపారు. రైతుల సర్పిలాకార తెల్ల దోమల్ని మొదట దశలోని గుర్తించి జీవనయంత్రం పద్ధతులను అవలంబించి నివారణ చేయవచ్చునని అన్నారు. పసుపు రంగు జిగురు అట్టలు చెట్లకు అమర్చడం, వేప నూనె 1500 పిపిఎం రెండు మిల్లీలీటర్ లీటర్ నీటి కలిపి పిచికారి, ఐసోరియ ఫిమరోజియా 5 మిల్లీ లీటర్లు లీటర్ నీటి కలిపి పిచికారి చేయడం వలన సమర్థవంతంగా నివారించవచ్చునితెలిపారు. కార్యక్రములో విహెచ్ఎ రోషన్ అరా, రైతులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా పంపిణీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత నిధులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా గురువారం మండల డ్వాక్రా సభ్యులకు పంపిణీ చేయనున్నట్లు ఎపిఎం రజనీకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా నిధులు డ్వాక్రా సంఘ సభ్యులకు పంపిణీ చేయడానికి గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) మైదానంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడవ విడత ద్వారా మండలంలోని 591 డ్వాక్రా సంఘ సభ్యులు లబ్ధి పొందనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, డ్వాక్రా సంఘ సంఘమిత్రలు సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలిపారు.

నిరాహార దీక్షలో ఆస్తుల పరిరక్షణ సమితి సభ్యులు

దేవస్థాన భూములకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని అనంతపురం గ్రామంలోని అనంతపురం గంగమ్మ తల్లి దేవస్థానం భూములు ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేసి, రక్షణ కల్పించాలని కొండూరు వెంకట్రామరాజు, చెంచర్ల ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట గంగమ్మతల్లి ఆస్తుల పరిరక్షణ సమితి కన్వీనర్ కొండూరు వెంకటరామరాజు, చెంచర్ల ఆంజనేయులు ఎస్ఆర్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజు నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ ఆలయ భూముల పరి రక్షించాలని అన్నారు. ముఖ్యంగా గుడికి ఎదురుగా ఉన్న అనంతపురం గ్రామ సర్వే నెంబర్ 300లో అయిదు ఎకరాల మూడు సెంట్లు భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించి ఆ భూమిని గంగమ్మ దేవస్థానమునకు అప్పజెప్పకపోతే ప్రజలను చైతన్య పరిచి ఉద్యతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు తిరుపతి శ్రీరాములు, తిరుపతి ఈశ్వరయ్య, తిరుపతి వెంకటరమణ, శంకరప్ప, రామయ్య, ఆలయ పూజారులు సెల్లు గంగయ్య, చంద్రబాబు, కోలకుంట కృష్ణయ్య, కార్యదర్శి జానం బాలాజీ, మాదా రమేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డిలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం ప్రతిపాదనలపై హర్షం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిటి కళాశాలను పట్టణ ప్రజలందరి కోరిక మేరకు ప్రభుత్వ పరం చేయడమే కాకుండా పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బిటి కళాశాలను యూనివర్శిటీ స్థాయికి మార్పుచేస్తూ డాక్టర్. అనిబిసెంట్ యూనివర్శిటీకి సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.డాక్టర్.అనిబిసెంట్ యూనివర్శిటీ ఏర్పాటుకు సహకరించిన ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణంలో వంద సంవత్సరాలపైగా చరిత్ర కలిగిన ప్రభుత్వ బి.టి.కళాశాలను అనిబిసెంట్ యూనివర్సిటీగా మార్చే ప్రతిపాదనకు ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆమోదం తెలపడంపై ప్రజాశాంతి పార్టీ జిల్లా కన్వీనర్ మాదిని భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నూతనంగా ఏర్పాటైనజిల్లాలో మొట్టమొదటి యూనివర్సిటీగా అభివృద్ధి చేయటానికి మదనపల్లి బీటీ కళాశాల ఎంతో చారిత్రాత్మకమైనదని గుర్తు చేశారు.

నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో మొట్టమొదటి యూనివర్సిటీగా అభివృద్ధి చేయటానికి మదనపల్లి బిటి కళాశాల ఎంతో చరిత్రాత్మకమైనదని బిటి కళాశాల పూర్వ విద్యార్థులు అసోసియేషన్ నాయకులు తెలిపారు. బి.టీ.కళాశాలను అనిబీసెంట్ యూనివర్సిటీగా మార్చే ప్రతిపాదనకు సిఎం జగన్ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రికి, ఎంపీ మిథున్ రెడ్డికి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు కళాశాల పూర్వ విద్యార్థులు అసోసియేషన్ బృందం కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు మార్పురి శశిధర్ నాయుడు, గౌరవ అధ్యక్షులు మార్పురి సుధాకర్ నాయుడు, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ వేణుగోపాల్, కమిటీసభ్యులు ఉదయ్‌కుమార్, రాందాస్ చౌదరి, బోర్‌వెల్ సుధాకర్, రాజ్‌భవన్ రాజా, నారాయణ, జయ నారాయణ రెడ్డి, యు.రెడ్డి సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భూ తగాదాలతో ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

భూతగాదాలతో ఘర్షణ పడగా కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రెడ్డి బాబు తెలిపారు. మండలంలోని కదిరాయి చెరువుకు చెందిన కోటకొండ వెంకటేశును అదే గ్రామానికి చెందిన ఉసిరికాయల శ్రీనాధకు భూతగాదాలు ఉండడంతో ఈనెల ఒకటవ తేదిన సాయంత్రం శ్రీనాధ జెసిబితో పొలంలో పనులు చేయబోతుండగా వేంకటేశు వెళ్లి ఆ పొలం తనదని అడ్డుకోగా ముద్దాయిలు ఉసిరికాయల శ్రీనాధ, అతని భార్య సుజాత, అతని అన్న వెంకటరమణ, వారి బంధువు మల్లిఖార్జున అను వారు రాళ్ళు, కర్రలతో వేంకటేశు పై దాడి చేసి కొట్టినట్లు తెలిపారు. వారికి భయపడి వేంకటేశు కదిరాయచెరువు వూరి లోకి వచ్చి వుండగా, సాయంత్రం తిరిగి వచ్చి వేంకటేశు పై దాడి చేసి కర్రలతో కొట్టినట్లు, అడ్డుపడిన గ్రామస్తులు రామ్మోహన్, అతని అన్న .శ్రీరాములు పై కూడాపె ఆ నలుగురు దాడి చేసి కర్రలతో కొట్టినట్లు బుధవారం వెంకటేసు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంకటేశు పిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.